

తొలి విగ్రహానికి పూజలు చేసి నిమజ్జనానికి తీసుకెళ్తున్న మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు

లోకపావని.. నమోస్తుతే

శరన్నవరాత్రుల సందర్భంగా విశేష పూజలందుకున్న అమ్మవారికి భక్తులు వీడ్కోలు పలికారు. కర్నూలు సంకల్‌బాగ్‌లో దుర్గామాత నిమజ్జన ఘాట్ వద్ద ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మేయర్ బీవై రామయ్య తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మవారి విగ్రహాలను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. - న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు, నగరం



తుంగభద్ర నదిలో నిమజ్జనం

భారీ వర్షాలతో అప్రమత్తత అవసరం


కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా కోరారు. ఆయన ఆదివారం సబ్ కలెక్టర్‌తోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు తదితరులతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేసి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏ సమస్య ఉన్నా 08518-277305 నంబరుకు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మండల, డివిజన్ కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అక్రమాలకు సహకారం

■ నిధులు పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది

■ రైతులకు రుణాలివ్వడంలో నిర్లక్ష్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:



ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది లక్షల హెక్టార్లలో సాగు భూమి ఉండగా.. 7.30 లక్షల మంది రైతులున్నారు. 99 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 1.50 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 25 సహకార బ్యాంకు శాఖలు ఉన్నాయి. 2024-25 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రైతులకు రూ.20 కోట్ల పంట రుణాలు, కౌలుదారులకు రూ.10 కోట్లు కలిపి మొత్తం రూ.30 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా కల్లూరు, ఓర్వకల్లు మండలం హుసేనాపురం, ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల, జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు సొసైటీ పరిధిలో 44 మంది కొత్త రైతులకు రూ.68.31 లక్షలు, పాత రైతులు మరో నలుగురికి రూ.5.10 లక్షలు కలిపి 48 మంది రైతులకు రూ.73.41 లక్షల రుణాలు పంపిణీ చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకు శాఖలపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా నగదును తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మరికొందరు డీసీసీబీని సంప్రదించకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాల్సిన వారే బ్యాంకుకు కన్నం వేస్తున్నారు. ఫలితంగా అభివృద్ధి మాట దేవుడెరుగు.. నష్టాల ఊబిలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

● ఆత్మకూరు సహకార బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్ రూ.78.77 లక్షలు స్వాహా చేశారు. బ్యాంకు నగదును తన అవసరాలకు, సొంత వ్యాపారానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ ఘటనలో అల్తాఫ్‌తో పాటు పాసింగ్ ఆఫీసర్ వెంకటరంగయ్య, నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు మేనేజర్ పెద్ద పులిరాజును సస్పెండ్ చేశారు. ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

● డీసీసీబీ అనుమతి లేకుండా వెలుగోడు సహకార బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి తన స్వీయ నిర్ణయాధికారంతో రూ.10 లక్షలను వెలుగోడు సొసైటీకి ఏడు నెలల కిందట మంజూరు చేశారు. ఆయన్ను పది రోజుల కిందట బనగానపల్లికి బదిలీ చేసినా రిలీవ్ కాలేదు. డీసీసీబీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

కొందరి నిర్వాకంతో..

మూడున్నర దశాబ్దాలపాటు నష్టాల్లో కూరుకుపోయిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇప్పుడిప్పుడే లాభాలబాట పడుతోంది.. అలాంటి తరుణంలో బ్యాంకులో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది నిర్వాకం కారణంగా తిరిగి నష్టాల్లోకి పయనించే పరిస్థితి నెలకొంది. బ్యాంకును సమర్థంగా నడిపించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనపై పట్టు లేకపోవడంతో కొందరు కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

లక్ష్యం రూ.300 కోట్లు..

సహకార బ్యాంకు శాఖల ద్వారా దీర్ఘకాలిక రుణాలను వ్యవసాయ, అనుబంధ శాఖలకు ఇవ్వాలని నిర్ణయించారు. పొట్టేళ్ల పెంపకం, పాడి గేదెలు, వ్యవసాయ పరికరాలతోపాటు ఉద్యాన పంటల సాగు తదితరాలకు ఉమ్మడి జిల్లాలో రూ.300 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఆలూరు, కర్నూలు కృష్ణానగర్, ఓల్డ్‌టౌన్, నందికొట్కూరు సహకార శాఖల పరిధిలో గొర్రెలు, పొట్టేళ్ల పెంపకానికి సంబంధించి ఏడు యూనిట్లకు రూ.57.74 లక్షల రుణాలు ఇచ్చారు. ఆలూరు, కృష్ణానగర్ శాఖల్లో ఉద్యాన పంటలకు సంబంధించి రెండు యూనిట్లకు రూ.36 లక్షల రుణాలిచ్చారు. మొత్తం తొమ్మిది మంది రైతులకు రూ.93.74 లక్షల దీర్ఘకాలిక రుణాలు మాత్రమే ఇచ్చారు.


● ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.330 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించుకోగా ఏడు నెలలవుతున్నా 57 మంది రైతులకు రూ.1.67 కోట్ల రుణాలు మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం.

కంప్యూటరీకరణ ఎప్పుడో..

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) దస్త్రాల కంప్యూటరీకరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తైతే తాము చేసిన అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతో కొందరు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్టోబరు 2తో గడువు ముగిసినా ఇప్పటివరకు ఒక్క సొసైటీలోనూ కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తికాలేదు. మరికొన్నింటిలో మొక్కుబడిగా పనులు మొదలు పెట్టారు.

శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం, న్యూస్‌టుడే : విజయ దశమి నేపథ్యంలో వేలాది మంది భక్తులు రాఘవుడి సన్నిధికి చేరుకున్నారు. దసరా సెలవులకు తోడు ఉద్యోగులకు శని, ఆదివారాలు సెలవు రోజులు కలసి రావడంతో భారీగా తరలివచ్చారు. ఫలితంగా మంత్రాలయం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులతో శ్రీమఠం మధ్వకారిడార్, ప్రధాన వీధులు, తుంగభద్ర నదీ తీరం, రాఘవేంద్ర కూడలి తదితర ప్రాంతాలు కిక్కిరిశాయి. రాఘవేంద్ర కూడలి నుంచి మాధవరం వైపు గ్రామ శివారు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు బారులుదీరాయి.



దేవరగట్టు బన్ని ఉత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

నేత్రానందం..
ఆది దంపతుల తెప్పోత్సవం



స్వామి, అమ్మవార్లకు ఆలయ ఉత్సవం



పుష్కరిణిలో తెప్పోత్సవం



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేద పండితులు మండపారాధనలు, కలశార్చనలు, జపానుష్ఠానాలు, విశేష కుంకుమార్చనలు, చండీహోమం, రుద్రహోమం, రుద్రయాగ పూర్ణాహుతి తదితరాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కలశోద్వాసన, వసంతోత్సవం, చండీశ్వరునికి మల్లికాగుండంలో అవభృథ స్నానం, త్రిశూలస్నానం జరిపించారు. సాయంత్రం 6.30 గంటలకు భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కళాకారుల నృత్య సందడి మధ్య స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, ఆలయ ఉత్సవం జరిపారు. రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో ముస్తాబు చేసిన తెప్పపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తజన శివనామ స్మరణల మధ్య తెప్పోత్సవం శోభాయమానంగా జరిగింది.



కర్రలతో తలపడుతున్న గ్రామాల ప్రజలు

దేవరగట్టు.. ఆచారానిదే పట్టు

■ కర్రల సమరంలో 100 మందికిపైగా గాయాలు

చేతిలో కర్రలు.. అగ్గి దివిటీలు.. డిర్రర్ గో పరాక్ అంటూ ఓవైపు... డోళ్లు వాయిస్తూ స్వామి జైత్రయాత్ర మరోవైపు.. ఆంక్షలు దాటుకొని.. ఆచారం ముందుకు సాగింది. దసరా పండగ రోజున అర్ధరాత్రి వేళ స్వామివారి బన్ని ఉత్సవం సాగింది. హొళగుంద మండలం దేవరగట్టుపై కొలువుదీరిన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర శనివారం అర్ధరాత్రి ఆరంభమై ఆదివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఈ కర్రల సమరంలో 100 మందికిపైగా గాయపడ్డారు.

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే :

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో భాగంగా నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలు కలిసికట్టుగా వచ్చి డొల్లనబండ వద్ద బాస చేశారు. అనంతరం గ్రామ పెద్దలు ఎస్పీ బిందు మాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వద్దకు వచ్చి ఉత్సవాలను నిర్వహించుకునేందుకు బండారు ఇచ్చి అనుమతి తీసుకున్నారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అనంతరం మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర ప్రారంభమైంది. ఉత్సవమూర్తులను తీసుకెళ్లే సమయంలో నెర

ఉత్సవం సాగిందిలా..

ణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఓవైపు.. అరికెర, అరికెరతండా, సుళువాయి, ఎల్లార్తి, బిళేహాలు ప్రజలు మరోవైపు ఉండి కర్రల సమర సంప్రదాయం కొనసాగించారు. కర్రలతో దాడులు చేసుకోవడంతో చాలామంది తలలు పగిలాయి. అనంతరం ఉత్సవ విగ్రహాలను పాదాలకట్ట, ముల్లబండ, రక్షపడ వరకు చేర్చారు. గొరవయ్య పిడికెడు రక్తం సమర్పించి శమీ వృక్షం వద్దకు చేరుకుని పూజలు చేసి ఎదురు బసవన్నగుడికి చేరుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరిగి సింహాసనం కట్టకు చేర్చడంతో జైత్రయాత్ర ముగిసింది. ఎదురు బసవన్నగుడి వద్ద గిరిమల్లయ్యస్వామి కార్ణికం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



చికిత్స పొందుతున్న బాధితుడు

లక్కీ డిప్ ఎవరికో

■ నేడు మద్యం దుకాణాల అనుమతులు ఖరారు



కేంద్రం	దుకాణాలు	దరఖాస్తులు
కర్నూలు	31	1449
కోడుమూరు	14	510
ఎమ్మిగనూరు	15	296
ఆదోని	12	247
కోసిగి	4	53
ఆలూరు	9	188
పత్తికొండ	14	303

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని జడ్పీ సమావేశ మందిరంలో మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించిన లక్కీడిప్ కార్యక్రమం సోమవారం జరగనుంది. కలెక్టర్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరిగిన సంగతి విదితమే. మొత్తం 99 దుకాణాలకుగాను 3,046 దరఖాస్తులు దాఖలయ్యాయి. మొత్తంమీద దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.60.92 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

ఆ దుకాణానికి భారీ డిమాండ్

కోడుమూరు స్టేషన్ పరిధిలోని గూడూరులో 34వ నంబరు మద్యం దుకాణం అనుమతికిగాను అత్యధికంగా 99 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత కర్నూలులో 5వ నంబరు మద్యం దుకాణం అనుమతికి 70, 7వ నంబరు దుకాణానికి 67 దరఖాస్తులు నమోదయ్యాయి. అతి తక్కువగా పత్తికొండ పరిధిలోని 90వ నంబరు, ఎమ్మిగనూరు పరిధిలోని 54, 55వ నంబరు దుకాణాలకు 7 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

గేటు పాసు ఉంటేనే అనుమతి

కర్నూలు జడ్పీ హాలులో 14వ తేదీ ఉదయం 8 గంటలకు లక్కీడిప్ జరగనుంది. గేటు పాసు పొందినవారిని మాత్రమే అనుమతించనున్నారు. గెజిట్ దుకాణాల వరుస క్రమం ప్రకారం కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, కోసిగి, పత్తికొండ స్టేషన్ల ప్రకారం లక్కీడిప్ నిర్వహించి అనుమతులు కేటాయిస్తారు. ప్రతి డిప్‌లో ఇద్దరిని ఎంపిక చేస్తారు. మొదట ఎంపికైన వ్యక్తి అనుమతి తీసుకోని పక్షంలో రెండో వ్యక్తికి ఖరారు చేస్తారు. అనుమతి దక్కించుకున్న వ్యక్తి వార్షిక అనుమతి రుసుములో ఆరో వంతు చెల్లించాల్సి ఉంటుంది.

సాగు.. కనెక్షన్లలో జాగు


■ వేలాది మంది రైతుల ఎదురుచూపు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సమస్యలు ఎదురవుతున్నాయి. రైతులు దరఖాస్తు చేసుకున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. బోర్లు వేసుకున్నా కనెక్షన్ లేకపోవడంతో పొలాలు సాగు చేయలేని పరిస్థితి. ఉమ్మడి జిల్లా పరిధిలో 10,523 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికిగాను డీడీల రూపంలో సుమారు రూ.30.23 కోట్ల వరకు చెల్లించారు. నెలలు గడుస్తున్నా ఆ శాఖ అధికారులు కనెక్షన్లు ఇవ్వడంలో అలక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేకపోతోంది.

సామగ్రి లేదంటూ..

రైతుల దరఖాస్తులకు తగ్గట్టు అవసరమైన సామగ్రి విద్యుత్తు శాఖలోని స్టోర్‌లో అందుబాటులో లేదు. 2 వేల కి.మీ. పొడవునా అవసరమైన కండక్టర్లు, 25 కేవీ సామర్థ్యమున్న 3,100 నియంత్రికలు, 500 కి.మీ. కేబుళ్లు కావాల్సి ఉంది. కర్నూలులోని స్టోర్‌లో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి కండక్టర్లు గానీ.. 25 కేవీ నియంత్రికలు, కేబుళ్లు అందుబాటులో లేవు. గతేడాది మార్చి నుంచి అవి స్టోర్‌కు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వలేకపోతున్నామని పేర్కొంటున్నారు.



తన పొలానికి విద్యుత్తు సర్వీసు కావాలంటూ కోవెలకుంట్లకు చెందిన సుబ్బారెడ్డి తొమ్మిది నెలల కిందట డీడీ తీసి విద్యుత్తు శాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించలేదు. ఎన్నికల పేరు చెప్పి కొన్ని రోజులు.. కొత్త ప్రభుత్వం వచ్చిందని ఇంకొన్ని రోజులు సాకులు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.వేలు ఖర్చు చేసి..

వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇస్తారన్న ఆశతో పలువురు రైతులు తమ పొలాలను చదును చేసి సిద్ధం చేసుకున్నారు. గడివేముల, మిడుతూరు, ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో రైతులు తమ పొలాలను చదును చేసేందుకుగాను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేశారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, గోనెగండ్ల తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సమస్యను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసినా ప్రయోజనం శూన్యమే. తమ వద్ద అవసరమైన విద్యుత్తు సామగ్రి లేదని, సరఫరా చేసిన వెంటనే సర్వీసులు ఇస్తామని పేర్కొంటున్నారు.


గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

నంద్యాల డివిజన్ పరిధిలో 1,823 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రూ.2 కోట్ల వరకు డీడీలు తీసి నెలలు గడుస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో తమకీ గతి పట్టిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు కార్యాలయాలకు అవసరమైన సామగ్రిపై గత ప్రభుత్వం శ్రద్ధ చూపి ఉంటే ప్రస్తుతం ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

నేటి నుంచి పల్లె పండగ

■ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,877 పనులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ప్రతి పల్లెకు రహదారి వసతి కల్పించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండగ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 14వ తేదీ నుంచి వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకులు పాల్గొంటారు. కర్నూలు జిల్లాలో 852 రహదారులకు రూ.81.40 కోట్లు, నంద్యాల జిల్లాలో 1,025 రోడ్ల నిర్మాణాలకు రూ.86 కోట్ల మేర ఖర్చు చేయనున్నారు. దీనికి ఉపాధి నిధులు వెచ్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు.. గ్రామాల్లో చక్కటి రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



గత ప్రభుత్వ నిర్లక్ష్యం

గత వైకాపా ప్రభుత్వం పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది. ఫలితంగా గ్రామాల్లో వసతులు కరవయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. ఉపాధి నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

ప్రజాప్రతినిధుల హాజరు

పల్లె పండగను పురస్కరించుకుని దేవనకొండ మండలంలో కలెక్టర్ రంజిత్‌బాషా సోమవారం పర్యటిస్తారు. ఎమ్మిగనూరు, పాణ్యం, పత్తికొండ, ఆదోని, కోడుమూరు ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, గౌరు చరితారెడ్డి, శ్యాంబాబు, పార్థసారథి, దస్తగిరిలు తమతమ నియోజకవర్గాల పరిధిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.



నదిచాగి వద్ద మోటార్లను గట్టుకు తరలిస్తున్న రైతులు

తుంగభద్రకు భారీగా వరద నీరు

హాలహర్వి న్యూస్‌టుడే : తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 9 గంటలకు 88,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో 20 గేట్లను 2.5 అడుగుల మేరకు ఎత్తి 73,260 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. 15 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాల్వలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 101.66 టీఎంసీలు నీటి నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

మోటార్లు తరలించుకుంటూ..

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే : ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కౌతాళం మండలం మేళిగనూరు వద్ద తుంగభద్ర నదిలో 80 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. దీంతో నదీతీర గ్రామాల రైతులు ఒడ్డున అమర్చుకున్న మోటార్లను గట్టుకు తరలించడంలో నిమగ్నమయ్యారు.



నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది




అడ్డు తొలగించుకుని.. ఇసుక దోచుకుని

కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల, నిడ్జూరు ప్రాంతాల్లో తుంగభద్ర నది నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందకాలు తవ్వినా.. ముళ్లకంచె అడ్డుగా వేసినా అక్రమార్కులు వాటిని తొలగించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొంటున్నారు. కొందరు రైతుల పొలాల్లో నుంచి నదిలోకి వెళ్లి ఇసుక తరలిస్తున్నారు.

- ఈనాడు, కర్నూలు

వంతెన కథ ఇంతేనా!

జిల్లా పశ్చిమ ప్రాంతంలో పూర్తి వెనుకబడింది. ఈ జాబితాలో ఆలూరు నియోజకవర్గం మొదటి వరుసలో ఉంటుంది. అందుకు నిదర్శనం ఈ రహదారి వంతెనే. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామం నుంచి అర్ధగేరి గ్రామానికి వెళ్లే దారి ఇది. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు చెరువు పొంగిపొర్లింది. ఈ గ్రామాల మధ్య దారిలో ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో హత్తిబెళగల్ గ్రామ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షమొస్తే అన్నదాతలు పొలం పనులు మానుకోవాల్సిందే. హత్తిబెళగల్ నుంచి నియోజకవర్గ కేంద్రంమైన ఆలూరుకు వెళ్లాలంటే 10కి.మీ. దూరం ప్రయాణిస్తే చేరుకోచ్చు. ప్రస్తుతం వంతెన చెదిరిపోవడంతో చింతకుంట, కామినహాలు, మేధేహాలు, అర్ధగేరి, హత్తిబెళగల్ గ్రామాలమీదుగా సుమారు 20 కి.మీ. ప్రయాణించి ఆలూరుకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే కోతకు గురైన వాగులోనే రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన బాగుచేయాలని అప్పటి అధికారులను, పాలకులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలులేవని ఆ ప్రాంత వాసులు ఎంతగానో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణ



సాయిబాబా ఆశయాలు కొనసాగిద్దాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని విరసం నాయకులు అన్నారు. మానవ హక్కుల నేత ప్రొఫెసర్ సాయిబాబా హైదరాబాదులో శనివారం మృతిచెందారు. కర్నూలులో ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. విరసం బాధ్యులు పాణి అధ్యక్షత


ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విరసం నేతలు

వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబా అరుదైన వ్యక్తిత్వం గల ప్రజా మేధావి, రాజ్యం క్రూరత్వానికి బలై పదేళ్లు జైలులో మగ్గిపోయారన్నారు. రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కుల నిర్మూలన పోరాట సమితి బాధ్యులు సుబ్బరాయుడు, బుడగ జంగాల సంఘం నాయకుడు తూర్పాటి మనోహర్, తదితరులు ప్రసంగించారు. సంతాప సభలో పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజాసాగర్, డీటీఎఫ్ బాధ్యులు రత్నం ఏసేపు, పోస్టల్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరెడ్డి, లక్ష్మీకాంత్, ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, నాగన్న తదతరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి రక్షణ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విద్యార్థులకు చదువుతో పాటు వృత్తిపర అంశాల్లో అవగాహన కల్పించడంతో పలు విషయాలు నేర్చుకోగలిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సమగ్రశిక్షా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లాలో 20 ఆదర్శ పాఠశాలలు, 24 జడ్పీ ఉన్నత పాఠశాలలు, 11 కేజీబీవీలు, 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 సాంఘిక సంక్షేమ, ఒక గిరిజన సంక్షేమ, రెండు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో వృత్తి విద్యను అమలు చేస్తున్నట్లు జీసీడీవో నాగసువర్చల తెలిపారు. ఒక్కో పాఠశాలలో రెండు సెక్టార్లు ఉండగా, ఒక్కో సెక్టారులో ఒక్కో లెవల్‌కు 40 మంది వివిధ ట్రేడుల్లో ఏడాదికి 80 గంటల పాటు శిక్షణ పొందనున్నారని తెలిపారు.

37 పాఠశాలల విద్యార్థులకు అవకాశం

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఈనెల 2 నుంచి స్థానిక పరిశ్రమలు, ఐటీ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, బ్యూటీపార్లర్, అల్లికలు, కుట్లు, హెల్త్, కేర్, బీఎఫ్ఎస్ఐ, ఆటోమేటివ్, ఫుడ్, ప్రాసెసింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో వారి సందేహాలు నివృత్తి చేశారు. 37 పాఠశాలల్లోని వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ట్రేడుల వారీగా ఆయా విభాగాల్లో అన్ని అంశాలు తెలియజేస్తున్నారు. ఈ సెలవుల్లో అనివార్యకారణాలతో శిక్షణ పొందని వారికి సంక్రాంతి, వేసవి సెలవుల్లో తర్ఫీదు ఇస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.


బైక్ మరమ్మతులపై విద్యార్థులకు అవగాహన

కంప్యూటర్‌పై అవగాహన పెరిగింది

- శరణ్య



డోన్ పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఆంగ్లమాధ్యమంలో చదువుతున్నాను. వృత్తివిద్యాకోర్సులో భాగంగా ఎలక్ట్రానిక్స్ ఎంచుకున్నా. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నాను. నోట్‌ప్యాడ్, వర్డ్ ప్యాడ్, పవర్‌పాయింట్, ఎక్సెల్(ఎంఎస్ ఆఫీస్)లో అవగాహన కలిగింది.

ఇదో చక్కటి అవకాశం

- ఆసిఫ్



ఆంగ్ల మాధ్యమంలో పదోతరగతి చదువుతున్నాను. బైక్, కారు మెకానిక్ షాపులో శిక్షణ పొందాను. యంత్రాలు, బ్యాటరీలు, పరికరాలపై అవగాహనతో పాటు వాటిని అమర్చే విధానంపై చాలా విషయాలు తెలిశాయి. ఉద్యోగాలకు ఎదురు చూడక స్వశక్తితో షాపును నిర్వహించి ఉపాధి పొందేందుకు ఇదో చక్కటి అవకాశం.

స్థానికంగానే తర్ఫీదు

- జి.నాగసువర్చల, జీసీడీవో, నంద్యాల

సహ పాఠ్యాంశాల్లో విజ్ఞానం పొందేందుకు ఇదో మంచి అవకాశం. శిక్షణా నైపుణ్యాలతో జీవితంలో స్థిరపడే విధంగా ఉపాధి అవకాశాలు పొందేందుకు చక్కటి మార్గం. జిల్లాలో 37 పాఠశాలల్లో వివిధ ట్రేడుల్లో స్థానికంగానే విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నాం.

కమనీయం.. గర్జిలింగేశ్వర స్వామి ఉత్సవం


ఆదోని మండలం నారాయణపురంలో బన్ని పూజలు చేస్తున్న భక్తులు

ఆదోని పట్టణంలో వెలసిన పురాతనమైన అంబాభవానీ దేవాలయంలో శనివారం రాత్రి దసరా పండగ సంబరాలు కనులపండువగా జరిగాయి. ఆలయంలో వెలసిన అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఆలయ ఆవరణలో రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ మైదానంలో ఏర్పాటు చేసిన రావణ, కుంభర్ణ దహన రాంలీలా కార్యక్రమం చేపట్టారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, భూపాల్‌చౌదరిలు రావణ, కుంభకర్ణ దహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది.

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే : ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో గర్జిలింగేశ్వరస్వామి ఉత్సవాలు కమనీయంగా జరిగాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు గర్జిలింగేశ్వరస్వామి, మాధవరాయస్వామి, మల్లేశ్వరస్వామి, వసిగేరప్పస్వామిలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, తీర్థప్రసాదం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బీరప్ప డోళ్లు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి ఊరేగింపు గోపరాక్ గోపరాక్ అంటూ గ్రామ వీధుల్లో సాగింది. బన్ని మంకాళమ్మ కట్ట వద్ద శమీ వృక్షానికి, అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ కోలాట నృత్యం, భవిష్యవాణి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.


ఆదోనిలో విజయదుర్గ అలంకరణలో దర్శనమిస్తున్న అంబాభవానీ అమ్మవారు

ఆదోనిలో రాంలీలా వేడుకలు..

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే :


రాంలీలా వేడుకల్లో భాగంగా రావణ, కుంభకర్ణ దహన కార్యక్రమం చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

డబ్బులు ఇవ్వలేదని భార్యను చంపేశాడు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: డబ్బు కోసం కట్టుకున్న భార్యను రాయితో కొట్టి హత్య చేసిన ఘటన గోనెగండ్ల మండలం కుటుమాలలో ఆదివారం చోటుచేసుకుంది. గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ చిన్న పక్కీరప్పకు కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన కురువ కృష్ణవేణి(26)తో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాగుడికి బానిసైన భర్త వేధింపులకు గురి చేసేవాడు. కొన్ని రోజుల కిందట భార్యతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. అత్తమామలు ప్రాథేయపడి ఒప్పించి దసరా పండగకు కృష్ణవేణిని గ్రామానికి తీసుకువచ్చారు. ఆదివారం భార్య భర్తలు ఇద్దరు పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన అనంతరం డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. తన దగ్గర డబ్బులు లేవని ఆమె చెప్పింది. ఈ విషయంలో భార్యభర్తలు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో భార్యను రాయితో పక్కీరప్ప కొట్టడంతో తలకు దెబ్బతగిలింది. తరువాత ఆమెను తోయడంతో కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉత్సవంలో విషాదం

☛ దేవరగట్టుకు వెళ్లి వస్తూ ముగ్గురి మృతి

ఆలూరు గ్రామీణ, హాలహర్వి, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వస్తూ కర్ణాటక వాసులు మృతి చెందిన ఘటన ఆలూరు మండలం కరడిగుడ్డం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని బళ్లారి జిల్లా తగ్గినబూదేహల్లి గ్రామానికి చెందిన హరీష్, రవి, మల్లికార్జున ద్విచక్ర వాహనంపై హొళగుంద మండలం దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వస్తుండగా శనివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో హరీష్, మల్లికార్జున అక్కడికక్కడే మృతిచెందగా రవిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.


హరీష్


రవి (పాత చిత్రాలు)


మల్లికార్జున

ప్రభ ఊరేగింపులో అపశ్రుతి

☛ ఐదుగురికి గాయాలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కందనాతిలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన చెన్నకేశవస్వామి ప్రభ ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. తెల్లవారు జామున స్వామివారి ఆలయం నుంచి ప్రభ ఊరేగింపుగా బయలుదేరి గ్రామ సమీపంలోని శమీ వృక్షానికి పూజలు చేసి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఓ పక్కకు ఒరిగిపోయింది. ఈ ఊరేగింపులో కందనాతితో పాటు మసీదుపురం, మాసుమాన్‌దొడ్డి, వెంకటగిరి ప్రజలు పాల్గొంటారు. ఈ ప్రమాదంలో వినోద్, హరికృష్ణ అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభ ఒరిగి పక్కనే ఉన్న విద్యుత్తు తీగలపై పడింది. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో ప్రమాదం తప్పింది.


ఊరేగింపులో ఒరిగిన ప్రభ

ఎంపీకి విక్టోరియన్ పార్లమెంట్ ఆహ్వానం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి మెల్‌బోర్న్- విక్టోరియా ప్రభుత్వ శాసన మండలి విప్, మిస్టర్ లీ తర్లామిస్ నుంచి ఆహ్వానం అందింది. అక్టోబరు 17-19 వరకు జరిగే విక్టోరియన్ పార్లమెంట్ సమావేశాలకు ఆమె హాజరుకానున్నారు. మన దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తూ ప్రసంగించనున్నారు. విక్టోరియా ప్రభుత్వం మద్దతుతో ఆస్ట్రేలయ నిర్వహించే ఆస్ట్రేలియన్ కమ్యూనిటీకి విశిష్ట సేవలందిస్తున్న భారతీయ సంతతికి చెందిన వైద్యులు, నర్సుల అసాధారణమైన సహకారం, తదితర అంశాలు ఈ ఈవెంట్ లక్ష్యం. తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు బైరెడ్డి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

రైలు పునరుద్ధరణ

తుంగభద్ర రైల్వేస్టేషన్ (మంత్రాలయం), ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరిస్తున్నట్లు మంత్రాలయం రైల్వే స్టేషన్ మేనేజర్ వాస్నిక్ ఆదివారం తెలిపారు. వారానికి నాలుగు రోజులు నడిచే రైలు ఆది, మంగళ, బుధ, శనివారాలు బెలగాం నుంచి బయలుదేరి మంత్రాలయానికి రాత్రి 11 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రమయాణంలో 17న మణుగూర్ నుంచి ప్రారంభమై మరుసటి రోజు తెల్లవారు జామున 4:30కు మంత్రాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. సోమ, గురు, ఆది, బుధవారాలు మంత్రాలయం నుంచి బయలుదేరుతుంది.

వైభవంగా గుర్రాల పారువేట సంబరం

మద్దికెర న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే ఎంతో ప్రత్యేకత సంతరించుకున్న గుర్రాల పారువేట ఉత్సవం వేలాది మంది సమక్షంలో శనివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానికుల హర్షధ్వానాల మధ్య మద్దికెరకి చెందిన యాదవరాజ వంశీకులు సంప్రదాయంగా గుర్రాలపై స్వారీ చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. దసరా పండగను పురస్కరించుకుని ఏటా మద్దికెరలో గుర్రపు పందెం పోటీలను వైభవంగా నిర్వహిస్తుంటారు. 3 వర్గాలకు చెందిన గ్రామస్థులు అశ్వాలను పూర్వీకులు నిర్మించిన బోజరాజు బావి వద్ద స్నానాలు చేయించిన అనంతరం పారువేట సందర్భంగా ప్రదర్శించే ఆయుధాలను గ్రామంలో ప్రదర్శనగా తీసుకువచ్చారు. అనంతరం అశ్వాలపై సంప్రదాయ దుస్తులు, తలపాగాతో ఖడ్గధారులై మజరా గ్రామం బొజ్జనాయునిపేట చేరుకొని బోగేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పోటీలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో 15 గుర్రాలు పోటీపడగా 3 కి.మీ దూరాన్ని ప్రయాణించి గ్రామంలోని పారువేట మిట్టను మొదటగా చేరుకున్న వేమనగారి వర్గానికి చెందిన జగదీల్‌రాయుడును విజేతగా ప్రకటించారు.

సంప్రదాయ వేడుక

ఎక్కడా లేని ఇలాంటి వేడుక మద్దికెరలో వందల ఏళ్లుగా కొనసాగుతోంది. ఇది గ్రామానికి, మా వంశానికి ఎంతో గర్వకారణమని నిర్వాహకులు రాజన్న యాదవ్, నీలకంఠరాయుడు, జయరామరాజు, విష్ణువర్ధన్‌రాయుడు, ఈశ్వరరాయుడు తదితరులు పేర్కొన్నారు. మా పూర్వీకులు నుంచి వచ్చిన ఈ సంప్రదాయాన్ని మేము కొనసాగిస్తున్నామని, మా అనంతరం మా వారసులు ఈ ఆనవాయితీని కొనసాగిస్తారని చెప్పారు. ఈ వేడుక కారణంగా జరిగే ప్రమాదాల్లో మా పిల్లలు, కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోతున్నా ధైర్యంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది పెద్ద ఉత్సవమని చెప్పారు.


గుర్రాలపై వెళ్తున్న యాదవరాజ వంశీకులు

గుడేకల్లు.. ఆకట్టుకున్న సాహస ప్రదర్శనలు


ఇనుప కొక్కీలు వేసుకొని బండి చక్రాన్ని లాగుతున్న యువకులు


కడ్డీలను అణచివేస్తున్న యువకుడు


ఆకట్టుకున్న ప్రదర్శన


వీపుపై ఇనుప కొక్కీలు వేసుకుని డ్రమ్ము సాయంతో లాగుతూ..

గుడేకల్లు, (ఎమ్మిగనూరు), న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు యువకులు సాహస ప్రదర్శనలు అబ్బురపరిచాయి. దసరా పండగ సందర్భంగా గ్రామంలో మూడు వ్యాయామశాలల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన యువత శని, ఆదివారం ప్రదర్శనలు చేశారు. ఇనుప కొక్కీలను వీపునకు తగిలించుకొని బండి చక్రాన్ని తాడు సాయంతో పైకి లాగడం వంటివి ప్రదర్శనలు చేశారు. అమ్మవారి వేషధారణలో యువకుడు ప్రదర్శనలు చేశారు. ద్విచక్ర వాహనాన్ని ఆటోకు అమర్చి వాటిని లాగడం వంటివి చేశారు. ఇటుకలను చిన్నారి నోటితో పైకి లేపారు. ఎద్దుల చక్రంపై ఇద్దరు యువకులు గాలిలో తేలడం తదితర విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ విన్యాసాలు తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. చింతమాను రామమ్మ, గచ్చెల గారడీల పేరుతో ప్రదర్శనలు చేశారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మద్దమ్మ ఆలయానికి రూ.2 లక్షల వితరణ



ఆలయానికి రూ.2 లక్షల విరాళం అందిస్తున్న గోనాల కుమార్ కుటుంబ సభ్యులు

మద్దికెర న్యూస్‌టుడే : మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ ఆలయ అభివృద్ధికి భక్తులు నగదు విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన గోనాల కుమార్ భార్య శారదమ్మ, వారి కుమారులు, కోడళ్లు ఆదివారం ఆలయ నిర్వాహకులు నీలకంఠరాయుడుకు రూ.2లక్షల నగదును అందజేశారు. ఈ సొమ్మును అమ్మవారి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వినియోగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టమాటా ధర తగ్గుముఖం

పత్తికొండ గ్రామీణం న్యూస్‌టుడే : పత్తికొండ టమాటా మార్కెట్‌లో గత నాలుగు రోజులుగా టమాటా ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఆదివారం గరిష్ఠ ధర రూ.4,300 కాగా కనిష్ఠ ధర రూ. 1800లు పలికింది. ఆదివారం 706 క్వింటాళ్లకు పైగా సరకు మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చారని అధికారులు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం :

సమస్య : ఆదోని పట్టణంలో చిన్నమార్కెట్ నుంచి వెంకన్నబావికి వెళ్లే నాలుగు రహదారుల కూడలిలో చెత్త పోగు పడి అపరిశుభ్రంగా మారింది. **- విరుపాక్షి ఆదోని**

సమాధానం : చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తాం.

- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం.

హొళగుంద:

సమస్య : హెబ్బటం గ్రామంలో అంగన్‌వాడీకి వెళ్లే మార్గంలో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం నిండటంతో దుర్వాసన వస్తోంది. **- రామాంజి, హెబ్బటం**

సమాధానం : పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం.

- రాజశేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి హెబ్బటం

చిప్పగిరి, : సమస్య : గౌరమ్మ కాలనీలో రహదారుల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- మధు, చిప్పగిరి

సమాధానం : నిధులు మంజూరయ్యాయి. రహదారులను బాగు చేస్తాం.

- అల్లాబకాష్, ఎంపీడీవో చిప్పగిరి



పెరవలిలో శ్రీరంగనాథస్వామి పల్లకోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రంగనాథునికి ఘనంగా పల్లకోత్సవం

మద్దికెర న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పెరవలి శ్రీరంగనాథస్వామి, భూదేవి, రాజ్యలక్ష్మి సమేతంగా పల్లకోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి, ఈవో వీరయ్య తదితరుల సమక్షంలో సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వెల్దుర్తి న్యూస్‌టుడే : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వెల్దుర్తి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆపధర్మ అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు



కోతిరాళ్లలో అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్న నూతన సచివాలయ నిర్మాణ ప్రాంతం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భవనాలు నిర్మించి గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించాలి. ఏ గ్రామ ప్రజలకు ఆ గ్రామ పరిధిలోనే సేవలందించాలి. ప్రతి సచివాలయంలోనూ ఎనిమిది నుంచి పది మంది సిబ్బందిని నియమించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాలని నాటి వైకాపా ప్రభుత్వం తలపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ నీరుగారిపోయింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కొన్ని గ్రామ సచివాలయాల నిర్మాణాలు పూర్తి కాలేదు. అయినా ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యేలు హడావుడిగా ప్రారంభించారు. ఆ తర్వాత వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అరకొరగా పూర్తయిన భవనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం ప్రియులకు అడ్డా

పత్తికొండ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు కొన్నింటిని ప్రారంభించారు. మరికొన్నింటిని అరకొర పనులు మిగిలుండగానే హడావుడిగా ప్రారంభించారు. మండల పరిధిలోని కోతిరాళ్లలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్‌లు గత ఎనిమిది నెలల క్రితమే పూర్తయినా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామానికి దూరంగా ఉండటంతో సచివాలయానికి వెళ్లేదారులు ముళ్ల కంపలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. శివారు ప్రాంతం కావటంతో సమీప కాలనీవాసులు బహిర్భూమికి సచివాలయానికి వెళ్లే ప్రాంతాన్ని వినియోగించుకుంటున్నారు. చందోలి గ్రామ సచివాలయం సుమారు 90 శాతం



పులికొండలో పాత సచివాలయ భవనం

మేర నిర్మాణ పనులు పూర్తయినా మిగతావి నిలిచిపోవటంతో సచివాలయం ప్రాంతమంతా బహిర్భూమికి వినియోగిస్తున్నారు. కార్యాలయం ఆవరణం మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

సదుపాయాలు కల్పించకపోవడంతో...

మండల పరిధిలోని పులికొండ గ్రామంలో ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రామ సచివాలయాన్ని నాటి ఎమ్మెల్యే ప్రారంభించారు. భవనంలో నీటి సదుపాయం, విద్యుత్తు సదుపాయం, తదితర సమస్యల వల్ల ఈ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో అవస్థల మధ్యనే పాత సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది వాపోతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తెస్తాం

- వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఏఈ, పత్తికొండ

చందోలి, పులికొండ గ్రామ సచివాలయాల్లో 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. కోతిరాళ్ల గ్రామ సచివాలయం పనులు నూరు శాతం పూర్తయినా గుత్తేదారులకు రావాల్సిన బిల్లులు పెండింగ్ కారణంగా వాటిని ప్రారంభించలేకపోయాం. ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మిగిలిపోయిన పనులను పూర్తయ్యేలా చూస్తాం.

అపూర్వ కలయిక..ఆనంద వేడుక

దేవనకొండ న్యూస్‌టుడే : మండలంలోని పి.కోటకొండ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09 బ్యాచ్ పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 16 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన నాటి ఉపాధ్యాయులైన సాయిబాబా, వెంకటేశ్వర్లు, పద్మనాభం, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సుజాత, గిడ్డమ్మ, విజయ్‌చంద్రలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.



పదో తరగతి పూర్వ విద్యార్థులు

దుర్మార్గ పాలనకు చరమగీతం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే : ఆదోని పురపాలక మైదానంలో దసరా పండగను పురస్కరించుకొని రాంలీల వేడుకలను శనివారం రాత్రి ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే డా.పార్థసారథి ప్రారంభించారు. మైదానంలో వందలాదిగా వచ్చిన జనం మధ్య అభివాదం చేస్తూ ఇరవై అడుగుల రావణ, కుంభకర్ణ బొమ్మలకు పూజలు నిర్వహించి, ఎమ్మెల్యే విల్లు ఎక్కుపెట్టారు. అనంతరం రాకెట్ ద్వారా రావణ, కుంభకర్ణ బొమ్మలను దహనం చేశారు. చెడుపై విజయం, అధర్మంపై.. ధర్మం విజయంగా



విల్లు ఎక్కుపెట్టిన ఎమ్మెల్యే డా.పార్థసారథి

దసరా పండగను నిర్వహించుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్‌పర్సన్ శాంత, జనసేన బాధ్యుడు మల్లప్ప, తెదేపా రాష్ట్ర నాయకులు గుడిసె కృష్ణమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, విట్టారమేష్, దసరా ఉత్సవ సమితి సభ్యులు శ్రీనివాస రెడ్డి, ఎగ్గటి ప్రతాప్, చెన్నబసప్ప, ఎండి.బసవరాజుస్వామి, పాల్గొన్నారు.

చర్చిలో ఎమ్మెల్యే ప్రార్థనలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలో ఎస్కేడి.కాలనీలోని చర్చిలో క్రిస్టియన్లతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే డా.పార్థసారథి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. క్రైస్తవ సమాజానికి తాను అండగా ఉంటానన్నారు. తమకు ఏ సమస్య వచ్చిన పాస్టర్లు నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రశాంతంగా దేవరగట్టు ఉత్సవం



మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్

హొళగుంద, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవం ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయాన్ని ప్రశాంతంగా జరుపుకొన్నందుకు ప్రజలకు, అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్ ఉత్సవాలను తిలకించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేశారన్నారు. నేడు రథోత్సవం, మంగళవారం గొరవయ్య గొలుసు తెంపడం, వసంతోత్సవం కార్యక్రమం, బుధవారం మాళమల్లేశ్వర స్వాములు నెరణికి గ్రామం చేరుకుని ప్రత్యేక పూజలను చేయడంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.



సిద్ధమైన మాళమల్లేశ్వర స్వామి రథోత్సవం

దసరా వేళ సందడి శోభ



ఆదోని గ్రామీణం : తిరుమలనగర్‌లో వేంకటేశ్వర స్వామి పూజలో పాల్గొన్న మహిళలు



ఆదోని మార్కెట్ : భక్తులతో అమ్మవారి శోభాయాత్ర



హాలహర్వి : శమీ వృక్షానికి పూజలు



హొళగుంద : దేవరగట్టులో గొరవయ్యలతో ఢమరుకం వాయిస్తున్న ఎమ్మెల్యే జయరాం



ఆదోని పాతపట్టణం : డ్రై ఫ్రూట్స్ అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



దేవనకొండ : జమ్మిచెట్టు ఆవరణలో లక్ష్మీచెన్నకేశవస్వామికి పూజలు



ఆస్పరి : వాసవిమాతను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



పత్తికొండ గ్రామీణం: అమ్మవారి ఊరేగింపును ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అవీ.. ఇవీ.. అన్నీ..

తుగ్గలి, న్యూస్‌టుడే : తుగ్గలి మండలంలో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం జి ఎర్రగుడి, పగిడిరాయి, అమీనాబాద్ గ్రామాలలో జరుగుతుందని ఎంపీడీవో విశ్వమోహన్, ఉపాధి ఏపీవో హేమసుందర్ తెలిపారు.

హొళగుంద, న్యూస్‌టుడే : ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో పల్లె పండుగ.. పంచాయతీ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి విజయలలిత ఒక ప్రకటనలో తెలిపారు.

మద్దికెర న్యూస్‌టుడే : మద్దికెర గ్రామ దేవత మద్దమ్మకు విశేష పూజలు నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెల్దుర్తి న్యూస్‌టుడే : అయోధ్యకు పాదయాత్రగా బయలుదేరిన బెంగళూరు రాజాజీ నగర్‌కి చెందిన తులసి కృష్ణ బృందం ఆదివారం వెల్దుర్తికి చేరింది. వీరికి అభయ హనుమాన్ వ్యవస్థాపకులు చిన్న రామాంజనేయులు స్వాగతం పలికారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో నేటి (సోమవారం) నుంచి జరిగే పల్లెపండుగ వారోత్సవాలను జయప్రదం చేయాలని స్థానిక ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

ముగిసిన బన్ని ఉత్సవం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : దేవరగట్టులోని బన్ని ఉత్సవం ప్రజల సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆలూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పత్తికొండ డివిజన్ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో నెల రోజులుగా గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులు, కార్డన్ సెర్చ్, నాటుసార ఊట ధ్వంసం చేయడంతో హింసకు అవకాశం లేకుండా చేశామన్నారు. ఈ ఉత్సవంలో ఐదు డ్రోన్ కెమెరాలు, 600 ఎల్‌ఈడీ లైట్లు, 100 సీసీ కెమెరాలు, 20 బాడీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈయనతో పాటు ఆలూరు ఎస్సై వెంకట నరసింహులు ఉన్నారు.



శ్రీనివాస్ నాయక్, సీఐ ఆలూరు

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

వెల్దుర్తి న్యూస్‌టుడే : మండల ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి 20 ఏళ్లుగా సేవలందించిన ఓంగోలు సాయిప్రసాద్‌ను మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతూ, నిరుపేద ఆర్యవైశ్యులకు స్వయం ఉపాధి ఏర్పాటుకు చేయూతనందించారని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు తెలిపారు.



ఓంగోలు సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

విజేతలకు బహుమతుల అందజేత

పత్తికొండ గ్రామీణం న్యూస్‌టుడే : దసరా వేడుకలను పురస్కరించుకొని స్థానిక ఫుట్‌బాల్ క్రీడాకారులు శనివారం 19 ఏళ్ల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గుత్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు జట్లకు దాతలు బహుమతులు అందజేశారు. సింహాద్రి, జైవీరా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువస్పందన సొసైటీ అధ్యక్షుడు సురేంద్ర, దాతలు రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ఖుష్ ఖరీద్

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో దసరా పండగ సందర్భంగా శనివారం ఖుష్ ఖరీద్ (సంతోష ధర) వ్యాపారం జరిగింది. దాదాపు పది వేల క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రావడంతో మార్కెట్ యార్డు సందడిగా కనిపించింది. క్వింటాలు సరాసరి గరిష్ఠంగా రూ.7600ల నుంచి కనిష్ఠంగా రూ.5,550ల వరకు ధర పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. పండగ రోజు ఎంత ధర పలికితే అంతకు పంట అమ్ముకోవడం వల్ల లక్ష్మీదేవి మన ఇంటికి వచ్చినట్లుగా ఇక్కడి రైతులు భావిస్తారు. ఇటు పంట కొనుగోలు చేయడం వ్యాపారులు శుభసూచికంగా భావిస్తారు.




ఆదోని మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి దిగుబడులు

దేవరగట్టులో కర్రల సమరం

దేవరగట్టులో కర్రల సాంప్రదాయం కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు కర్రలతో విగ్రహాల కోసం పోటీ పడ్డారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఆలూరు గ్రామీణం, హాలహర్వి న్యూస్‌టుడే:



జనసంద్రంగా మారిన దేవరగట్టు



చికిత్స పొందుతూ



బన్ని ఉత్సవాన్ని తిలకిస్తున్న ఎస్పీ బిందుమాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తెదేపా నాయకులు వీరభద్రగౌడ్ తదితరులు

ఆటో లారీ ఢీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణ శివారు రాయనగర్ పైకొట్టాల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదోని పట్టణం ఖాజీపుర ప్రాంతానికి చెందిన అన్వర్‌బాషా, మాబీని, రేష్మా, తాహెర్‌బాషాలతో పాటు మరొకరు కలిసి పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి ఆటోలో వెళుతున్నారు. రాయనగర్ పైకొట్టాల సమీపంలో ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : హాలహర్వి మండలం బిళేహాలు గ్రామానికి చెందిన హనుమంతు అనే యువకుడు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. కుటుంబ సమస్యలతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

కన్నతల్లికి కడుపు కోత

ఆస్పరి, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడికి విషజ్వరం రావడంతో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆస్పరి పట్టణానికి చెందిన మహేశ్వరికి ఇద్దరు సంతానం. ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. కుమారుడు శివసాయికి (17) రెండు రోజుల క్రితం విషజ్వరం రావడంతో ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహేశ్వరి భర్త భీమేష్ 2018లో చనిపోయారు. తన కుమారుడు తనకు అండగా ఉంటాడనుకుంటే తన కళ్లెదుటే మృత్యు ఒడికి చేరడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.

కాలనీల్లో సమస్యలు.. స్థానికులకు కష్టాలు



ఇళ్ల ముందు బురద దారులు, అపరిశుభ్రత

ఆదోని పురపాలకం న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలో 23వ వార్డు పరిధిలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కాలనీలో మౌలిక వసతుల లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. 167వ జాతీయ రహదారికి సమీపంలోనే ఈ కాలనీ ఉంటుంది. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచాయి. అయినా నేటికి సరైన వసతులు లేక జనం ఇబ్బందుల మధ్య కాలం గడుపుతున్నారు. ఇక్కడి సమస్యల పరిష్కారానికి ఏళ్లుగా పోరాటం చేస్తున్నా, అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

☛ స్థానిక కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాలనీ ముఖద్వారంలో అరకొరగా రహదారులు, మురుగు కాలువలు నిర్మించి వదిలేశారు. వర్షం వచ్చిందంటే చాలు కాలనీ దారులలో మోకాలి లోతు నీరు నిలుస్తోందని, ఇంట్లో నుంచి బయటికి రాలేని దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని నిత్యం స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. మహిళలకు సాముహిక శౌచాలయాల వ్యవస్థ లేకపోవడంతో నేటికి బహిర్భుమికి ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కర్రలకు విద్యుత్తు సర్వీస్ తీగలు

ఇళ్ల ముందే పాములు సంచారం - లక్ష్మి ఆదోని



కాలనీలో అపరిశుభ్రత కారణంగా పట్టపగలు ఇళ్ల ముందే పాములు సంచరిస్తాయి. పిల్లలను బయటకు పంపించాలంటేనే భయమేస్తుంది. వర్షం వస్తే ఇళ్ల లోనుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. తాగునీటికి కూడా నిత్యం ఇబ్బందులు పడుతున్నాము. అసలే శివారు ప్రాంతంలో ఉంటున్నాం. ఇక్కడా కనీస వసతులు లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నాము. ఎంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు మారిన సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

కర్రలతోనే తీగలు -వెంకటమ్మ, ఆదోని



మా కాలనీలో మౌలిక వసతుల కోసం అనేక సార్లు పోరాటం చేశాం. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చాలాసార్లు సమస్యలను విన్నవించాము. రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలి. కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి.

అంగన్‌వాడీ భవనం..నిరుపయోగం



చిప్పగిరి మండలంలోని అంగన్‌వాడీ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి కొద్దిపాటి మరమ్మతులు చేపడితే వినియోగంలోకి తీసుకురావచ్చని స్థానికులు చెబుతున్నారు. మండలంలో 32 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో చాలా వరకు ప్రాథమిక పాఠశాల భవనాల్లోనే పనిచేస్తున్నాయి. ఖాజీపురం, చిప్పగిరి ఎస్సీ కాలనీ, ఏరూరు రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో వర్షం కురిసిందంటే చాలు నీళ్లు కారుతున్నాయి. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే చిప్పగిరి

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పెద్దమర్రివీడులో చిన్ననాటి మిత్రుడు కె.నబిరసూల్ కుటుంబానికి అండగా ఉంటామని 2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. బాషా, జిలానీ, జాకీరహుస్సేన్ చెప్పారు. ఆదివారం వారు మిత్రుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్నేహితుని కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ మిత్రుడు బుక్ కీపర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడన్నారు. అతను మరణించడంతో వారి కుటుంబం ఇబ్బందుల్లో ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణ, రంగస్వామి, వీరేష్, రంగన్న, జనార్దన్, రామకృష్ణ, రసూల్ పాల్గొన్నారు.

రాఘవుడి సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: విజయ దశమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి బద్వేలు జిల్లా ఎస్పీ శోభారాణి, కర్నూలు జిల్లా కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డిలు కుటుంబ సమేతంగా మంత్రాలయం చేరుకున్నారు. శ్రీమఠం చేరుకున్న వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు (గ్రామీణం) : 80085 73794
కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మేకడోన గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. –గ్రామస్థులు, మేకడోన

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. –జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

నందవరం, న్యూస్‌టుడే: **సమస్య:** నాగలదిన్నె గ్రామంలో తుంగభద్ర నది వంతెన పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. – కిశోర్, నాగలదిన్నె

సమాధానం: విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలను తొలగిస్తాం. –నాగేంద్ర, ఏఈ, నందవరం

ప్రజా సమస్యలు తీర్చడమే లక్ష్యం: బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.


ప్రజాదర్బార్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరులోని ఓ కల్యాణ మండపంలో ప్రజాదర్బార్‌ను ఆదివారం నిర్వహించారు. పట్టణంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా పింఛన్లు, రేషన్‌కార్డు, మురుగు కాల్వలు, రోడ్లు తదితర అంశాలపై విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలను తక్షణమే తీరుస్తామన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఎవరైనా దౌర్జన్యాలు చేస్తే అణచివేస్తామని హెచ్చరించారు. పట్టణంలో స్థలాలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు తాము నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చిన సమస్యలను ఆయా అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసి వాటిని గడువులోపు తీరుస్తామన్నారు. ప్రతి నెలా నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నజీర్, అమానుల్లా, దేవేంద్ర, మిన్నప్ప, నరసప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో సీసీ రోడ్లు, కాల్వలు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణ పరిష్కరించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి సీపీఐ ఎంఎల్ నాయకులు విన్నవించారు. ఆదివారం సీపీఐ ఎంఎల్ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు గుంతల మయంగా మారాయని వీటిని పరిష్కరించాలన్నారు. శివారు ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు లేవన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు సత్యన్న, బాబు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారానికి చెదలు

◆ ప్రమాదకరంగా మారిన గ్రంథాలయం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు గ్రంథాలయానికి 50 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. దశాబ్దాలుగా సొంత భవనం లేకపోవడంతో ఇక్కడి పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సంతలో, ముని మందలో ఉండేది. ప్రస్తుతం కోట్ల కూడలి సమీపంలో మూడు దశాబ్దాలుగా పురాతన భవనంలో కొనసాగుతోంది. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి పుస్తకాలకు చెదలు పట్టింది. పైకప్పుపై పిచ్చిమొక్కలు పెరిగాయి. కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారింది. గదులు దుర్వాసనతో నిండిపోయాయి. కనీస సౌకర్యాల్లేవు. ఏటేటా పాఠకులు తగ్గిపోతున్నారు. కొత్త, పాత సమాచారానికి వచ్చే పాఠకులు గ్రంథాలయాన్ని చూసి అటు నుంచే వెనుదిరుగుతున్నారు. 30 ఏళ్లుగా శిథిలమైన గదిలోనే కొనసాగుతోంది.


చెదలు పట్టిన పుస్తకాలు

తగ్గుతున్న పాఠకులు

కోడుమూరుతోపాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన పాఠకులు సైతం గతంలో ఈ గ్రంథాలయానికి వచ్చేవారు. ఒకప్పుడు 100 మందికిపైగా పాఠకులు ఉండేవారు. అసౌకర్యాలు నెలకొనడంతో ఏటా తగ్గిపోతున్నారు. రెండు చిన్న గదులు ఉన్నాయి. వర్షానికి అవి అపరిశుభ్రంగా మారాయి. పుస్తకాలకు చెదలు, బూజు పట్టి పట్టుకోలేనంతగా తయారయ్యాయి. దాంతో పాఠకుల సంఖ్య 30 మందికి మించడం లేదు. కిటికీలు లేకపోవడం, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో పాఠకులు అల్లాడుతున్నారు.

నిధులు మంజూరైనా..

గ్రంథాలయం భవన నిర్మాణానికి 2022-23లో నిధులు మంజూరయ్యాయని వైకాపా ప్రభుత్వ నాయకులు చెప్పిన మాటలు నీటి మీద రాతలు మారాయి. విజయవాడ గ్రంథాలయ సంస్థ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలవుతాయని చెప్పారు. ప్రస్తుతమున్నచోటే భవనం నిర్మించుకునేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతమున్న గదితోపాటు దాని వెనకున్న ప్రహరీ స్థలం అర సెంటు సైతం గ్రామ పంచాయతీ అనుమతి ఇచ్చి గ్రంథాలయం నిర్మాణం చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు. నూతన నిర్మాణానికి రూ.34 లక్షలు మంజూరయ్యాయని, టెండర్ల దశలో ఉందని గ్రంథపాలకుడు అశోక్ పేర్కొన్నారు.


మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారిన గ్రంథాలయ భవనం

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నాం

రంగస్వామి, చనుగొండ్ల



గ్రంథాలయంలో పుస్తక పఠనం సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నాం. గదిలో దుర్వాసన వస్తుండటంతో కొద్దిసేపు కూడా ఉండలేకపోతున్నాం. విద్యుద్దీపాలు లేకపోవడంతో చీకటి ఉంటోంది. పంకాలు తిరగక గాలి ఆడటం లేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి నూతన భవనం నిర్మించి సమస్యలు పరిష్కరించాలి.

నిలిచిన నిర్మాణం



కంబళదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఈ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు శిథిలావస్థ పాఠశాల గదిలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రానికి నిత్యం సుమారు 30 మంది చిన్నారులు, 20 మంది గర్భిణులు, 10 మంది బాలింతలు వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కేంద్ర నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి నాలుగేళ్లు కావస్తోంది. నిధుల లేమితో పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. సంబధిత ఉన్నతాధికారులు స్పందించి కేంద్ర నిర్మాణం పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పెద్దకడబూరు

చిన్నవర్షానికే.. బురద



గోనెగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాలు చిన్నపాటి వర్షానికే బురదగా మారుతున్నాయి. ఈ పాఠశాలలో 1,400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ నాడు-నేడు పనులతో ఆవరణంతా గుంతలమంగా మారింది. దీంతో ఆ గుంతల్లో వర్షం నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్రతపై విశ్రాంత ఐజీ మహ్మద్ ఇక్బాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల


మంత్రాలయం గ్రామీణం: హాల్వీలో బన్ని ఉత్సవాల సందర్భంగా జమ్మి చెట్టు వద్ద పూజలు



మంత్రాలయం గ్రామీణం: కలశాలతో మహిళలు


మంత్రాలయం గ్రామీణం: ఉటగనూరుతాత రథోత్సవం


మంత్రాలయం గ్రామీణం: వల్లూరులో అమ్మవారి పల్లకి ముందు పొర్లుదండాలు


మంత్రాలయం గ్రామీణం: అమ్మవారి వేషధారణలో నృత్యం


మంత్రాలయం గ్రామీణం: పల్లకోత్సవంలో చిన్నారుల కోలాటం


మంత్రాలయం: ధనలక్ష్మీ అవతారంలో గ్రామ దేవత


కోసిగి: పూల అలంకరణలో మారెమ్మ అవ్వ


కోడుమూరు గ్రామీణం: కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

దసరా ఉత్సవం.. కళల సంబరం

దసరా ఉత్సవాలు పురస్కరించుకుని ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా నియోజకవర్గాల్లోన్ని గ్రామాల్లో దసరాను వైభవంగా నిర్వహించారు. శనివారం గ్రామాల్లో భక్తులు జమ్మి చెట్టుకు ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆదివారం వివిధ కార్యక్రమాలు అలరించాయి.

-న్యూస్‌టుడే బృందం


ఎమ్మిగనూరు: తేరుబజార్‌లోని దేవీమాతకు పూజలు జరిపి నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


ఎమ్మిగనూరు: ఇందిరానగర్‌లో పూజలు


మంత్రాలయం: విశేష అలంకరణలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు


నందవరం: గురజాలలో రామలింగేశ్వర స్వామి పల్లకి ఊరేగిస్తున్న ప్రజలు


గూడూరు: అమ్మవారి ఊరేగింపులో నృత్యం


గూడూరు గ్రామీణం: చిన్నారులకు జ్ఞాపికల అందజేత


సి.బెళగల్: వాసవీమాతాకు అష్టోతర శతానామావళి పఠిస్తున్న బాలికలు, మహిళలు

సుంకేసులకు 69,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం 69,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని జలాశయ ఇంజినీరు రాజు పేర్కొన్నారు. 16 గేట్లు ఎత్తి నది దిగువకు 67,312 క్యూసెక్కులు, కేసీకు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో నదిలోకి ఎవరూ వెళ్లకూడదని ఆయన సూచించారు.

అంబా భవానిని దర్శించుకున్న తెదేపా నాయకులు

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో కొలువైన అంబా భవాని అమ్మవారిని మంత్రాలయం నియోజకవర్గం తెదేపా నేత రాఘవేంద్ర రెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, కౌతాళం మండల నాయకులు ఉలిగయ్య శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి మఠస్వామి తాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వాళ్లను ఆశీర్వాదించారు. గ్రామంలో ఆలయ నిర్మాణం, బైపాస్ రోడ్డు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వీరేష్, చింతలగేని నర్సారెడ్డి, గ్రామ సర్పంచి అయ్యప్ప, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రహ్లాదరాయల రథోత్సవం

మంత్రాలయం, న్యూస్‌టుడే: విజయ దశమి రోజున ప్రహ్లాదరాయల రథోత్సవం నిర్వహించారు. శ్రీమఠంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో విజయదశమి (దసరా)ను పురస్కరించుకుని శ్రీమఠంలో బృందావనానికి విశేష పూజలు నిర్వహించి, బంగారు, నవరత్న ఆభరణాలతో అలంకరించారు. శ్రీమఠంలో ఉన్న శమీ వృక్షానికి విశేష పూజలు నిర్వహించి, గ్రామ దేవత మంచాలమ్మకు హారతి ఇచ్చారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు బంగారు, నవరత్న రథాలపై ఉంచి హారతి ఇచ్చారు. అనంతరం అశేష జన వాహిని మధ్య శ్రీమఠం ప్రాకారంలో మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పండిత కేసరి, రాష్ట్రపతి అవార్డు గ్రహిత రాజా ఎస్ గిరియాచార్, రాజా అప్రమేయ అచార్, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమఠంలో శమీ వృక్షానికి పూజలు


శ్రీమఠం ప్రాకారంలో శమీ వృక్షానికి పూజలు చేసి హారతి ఇస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: విజయ దశమి రోజున శ్రీమఠం ప్రాకారంలో శమీ వృక్షానికి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలను శమీ వృక్షం వద్ద ఉంచి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు విశేష పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు.

సాయిబాబా మృతి తీరని లోటు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మానవ హక్కుల నేత, ప్రముఖ రచయిత ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటని సీపీఐ పట్టణ నాయకులు రంగన్న అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేశారన్నారు. ఆదివాసీల హక్కుల నేతగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు దేవసహాయం ఆదివారం పేర్కొన్నారు. మానవ హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తిని కొనియాడారు.

కీర్తి.. యువతకు స్ఫూర్తి

☛ గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి అవకాశాలు సద్వినియోగం చేసుకొని దూసుకెళ్తున్నారు. పల్లెటూరులో ఆడపిల్లకు చదువెందుకని చెబుతున్నా లెక్క చేయకుండా అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చదువుతో పాటు లాక్రోస్ క్రీడలో సత్తా చాటుతోంది. దృఢ సంకల్పంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన కీర్తిపై కథనం.

మండలంలోని కులుమాల గ్రామానికి చెందిన చిన్నలింగన్న, జయమ్మ దంపతులకు నలుగురు సంతానం. పెద్ద కుమార్తె కీర్తి. తల్లిదండ్రులకు వ్యవసాయ కూలీ పనులే జీవనాధారం. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పది వరకు చదివింది. అనంతరం ఇంటర్మీడియట్ గోనెగండ్ల ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంది. రెక్కల కష్టంతో తల్లిదండ్రులు ఆడపిల్ల అనే తేడా లేకుండా కుమార్తెను ప్రోత్సహిస్తున్నారు.

అంతర్జాతీయస్థాయికి..

లాక్రోస్ క్రీడలో ఈ ఏడాది మార్చి 29 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జాన్‌మిల్టన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టుకు కీర్తి ఎంపికైంది. జాతీయ స్థాయిలో ఆంధ్ర జట్టు తరఫున మంచి ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగింది. 2024లో జులై 1 నుంచి 4 తేదీ వరకు ఉజ్బెకిస్తాన్ దేశంలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో లాక్రోస్ క్రీడలో భారత్ తరఫున ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో రజత పతకం గెలుచుకున్నట్లు ఏపీ లాక్రోస్ క్రీడా అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ముని కృష్ణయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ షాహినాపర్వీన్ చెప్పారు.


కీర్తిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం

కర్నూలులో లాక్రోస్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ ఏడాది ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు జరిగాయి. కీర్తి జిల్లా జట్టుకు సారథ్యం వహించి మూడు గోల్స్ సాధించి జిల్లా జట్టును రన్నరప్‌గా నిలిపింది. ఇదే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంది.

సెప్టెంబరు 27 నుంచి 29 వరకు ఈ ఏడాదిలో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిన జాతీయ లాక్రోస్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్ బాలికల జట్టుకు కెప్టెన్ వ్యవహరించి ఏపీ జట్టును నాల్గో స్థానంలో నిలిపింది. జట్టు విజయం సాధించడానికి కీలకంగా ఆడటంతో ఏషియన్ గేమ్స్ పోటీలకు ఎంపికైంది.

ఒలింపిక్స్‌లో ఆడటమే లక్ష్యం


ఉజ్బెకిస్తాన్‌లో జాతీయ జెండాతో కీర్తి

2028లో జరిగేలో ఒలంపిక్స్‌లో లాక్రోస్ క్రీడలో భారత్ తరఫున ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నా. ఉజ్బెకిస్తాన్ జరిగిన ఏషియన్ గేమ్స్ వెళ్లడానికి ఆర్థికం ఎంతో ఇబ్బంది పడ్డాను. మా నాన్న ఎంతో కష్టంతో పంపారు. ఆస్ట్రేలియాలో పాల్గొనే పోటీలకు దాతలు సాయం చేస్తే క్రీడల్లో సత్తా చాటుతాను.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని హనుమాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సత్యనారాయణ ఆయన భార్య, కుమారుడు, మరదలుతో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన సురేశ్ వెనక నుంచి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. భార్య సరస్వతి, మరదలు ఈరమ్మ, కుమారుడు చెన్నకేశవులు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్ కానిస్టేబుల్ కోదండరామిరెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన సోమశేఖర్‌కు సువర్ణను ఇచ్చి వివాహం చేశారు. గత 5 సంవత్సరాల నుంచి మంత్రాలయంలో హోటల్‌లో పని చేస్తూ జీవితం సాగించేవారు. గత కొంత కాలంగా సోమశేఖర్ కడుపు నొప్పితో బాధ పడుతూ ఉండేవారన్నారు. వారం రోజుల కిందట శిరుగుప్పకు వెళ్లి ఆదివారం తిరిగి వచ్చినట్లు చెప్పారు. భార్య మంత్రాలయంలో ఉన్న తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి ఎంతసేపటికి తలుపు తీయకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి కిటికిలో నుంచి చూసే సరికి చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తలుపులు పగల గొట్టి లోపలికి వెళ్లి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బంగారం, నగదు చోరీ

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి 9వ వార్డులో కమ్మరి కాలనీలో నివాసం ఉంటున్న నర్సన్న ఆచారి, అంబమ్మ దంపతులు గత రెండు నెలల కిందట బతుకుదెరువు కోసం బెంగళూరు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఈ నెల 12న రాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.60 వేల నగదును దొంగలించినట్లు బాధితులు ఆదివారం తెలిపారు. బెంగళూరులో ఉన్న బాధితులకు బంధువులు దొంగతనంపై సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా బీరువా పగలగొట్టి, బంగారం నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై ఎస్సై చంద్రమోహన్ వివరణ కోరగా బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

అవీ..ఇవీ ..అన్నీ

సి.బెళగల్, న్యూస్‌టుడే: పోలకల్ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ధర్మకర్త ఎ.పద్మనాభరెడ్డి తెలిపారు.

సి.బెళగల్: గ్రామంలో తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉపతహసీల్దారు పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

సి.బెళగల్: గ్రామంలో భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జ్యోతి తెలిపారు.

సి.బెళగల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యాధికారి ప్రసాదరెడ్డి తెలిపారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

అత్యున్నత విద్య అభ్యసించేలా కృషి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: నూర్‌బాషా దూదేకుల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను సివిల్స్, గ్రూప్-1, 2 తరహా విద్య అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు పొందేలా కృషి చేయడమే రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ఉద్యోగుల సంఘం లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సిద్దయ్య తెలిపారు. ఆదివారం స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో దూదేకుల మేధావులు, ఉద్యోగులు, నాయకులకు ఘన సన్మానం నిర్వహించారు. ఐఆర్ఎస్ సాధించిన ఆదోనివాసి సమీర్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల అధినేత నాగూర్, ఉద్యోగు సంఘ నాయకులు బాజీ కన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పీరు మహమ్మద్, ప్రధాన కార్యదర్శి సలీం కోశాధికారి దస్తగిరి, డాక్టర్ బాబన్ నూరు, మొహమ్మద్ లాల్ నజీర్, రాయలసీమ ప్రాంత వర్కింగ్ అధ్యక్షుడు ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, విశ్రాంత ఎస్పీ కిషోర్‌బాబు, షేక్షావలి, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

నగరంలో భారీ బందోబస్తు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి భారీ భద్రత ఏర్పాటు చేశారు. కర్నూలు డీఎస్పీ బాబూ ప్రసాద్, స్టేషన్ సీఐలు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. కర్నూలులో 130 విగ్రహాలు ఉండటంతో అన్ని ప్రధాన కూడళ్లలో రహదారి వెంట పోలీసులను నియమించారు. స్థానిక సంకల్‌బాగ్‌లోని దుర్గాఘాట్‌కు తరలించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే:
సమస్య: జొహరాపురంలో మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువలు శుభ్రం చేయాలి.
– స్థానికులు
సమాధానం: సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం. వ్యర్థాలు తొలగిస్తాం.
– నగరపాలక అధికారులు

సంక్షిప్త సమాచారం

☛ దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో మృతి చెందడం అణగారిన వర్గాల ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, ప్రజలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.రామాంజనేయులు అన్నారు. వారు సంతాపం వ్యక్తం చేశారు.

☛ నగరంలోని 45వ వార్డులో అజీముద్దీన్ నగర్‌లో మదరస, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ ఫాతిమ, డాక్టర్ మౌనికలు రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆవాజ్ కమిటీ నాయకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, వెంకటరమణ కాలనీ

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

కర్నూలు సంక్షేమం,న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఈ నెల 21వ తేదీ లోగా జ్ఞాన భూమి పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి తెలిపారు. దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.2.5లక్షలు మించరాదు, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం పేర్కొన్న అర్హతలు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 27న ఆన్‌లైన్ స్క్రీన్ టెస్టు రాయాల్సి ఉంటుందన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇబ్బందులు కలగకుండా చర్యలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు జడ్పీలో సోమవారం జరిగే లక్కీడిప్ నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జడ్పీ కార్యాలయం లోపల మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు డిప్ నిర్వహణకు సంబంధించిన విధులు నిర్వర్తిస్తారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇద్దరు డీఎస్పీలు, 22 మంది సీఐలు, 16 మంది ఎస్సైలు, 118 మంది పోలీసు సిబ్బందిని నియమించారు.

బంగారం, నగదు చోరీ

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి 9వ వార్డులో కమ్మరి కాలనీలో నివాసం ఉంటున్న నర్సన్న ఆచారి, అంబమ్మ దంపతులు గత రెండు నెలల కిందట బతుకుదెరువు కోసం బెంగళూరు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఈ నెల 12న రాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.60 వేల నగదును దొంగలించినట్లు బాధితులు ఆదివారం తెలిపారు. బెంగళూరులో ఉన్న బాధితులకు బంధువులు దొంగతనంపై సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా బీరువా పగలగొట్టి, బంగారం నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై ఎస్సై చంద్రమోహన్ వివరణ కోరగా బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.



కరిగిన నిధులు.. చెదిరిన రంగులు

■ నాణ్యత మటుమాయం
■ పట్టించుకోని అధికారులు

వైకాపా ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ చేపట్టిన వివిధ పనుల్లో నాణ్యత ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. పనులు పూర్తయిన కొన్ని నెలల్లోనే నాణ్యత లోపం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. వైకాపా ప్రభుత్వ పాలకులు, అధికారులు కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో విభాగినులు, కూడళ్లకు రూ.లక్షలు వెచ్చించి రంగులు వేశారు. నెలల వ్యవధిలోనే రంగులు వెలసిపోయాయి. ఫలితంగా ప్రజాధనం వృథా అయింది.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:

కర్నూలు నగరంలోని సి.క్యాంపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు కూడలి వరకు వెళ్లే దారిలోని డివైడర్స్ ఇవి. 2023 మే, జూన్ నెలల్లో వీటికి రంగులు వేశారు. రూ.లక్షలు వెచ్చించారు. అప్పట్లోనే నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. అధికారులు మాత్రం చెవిన వేసుకోలేదు. పాలకులు కేవలం తమ కమీషన్లపై దృష్టిసారించారు. అధికారులు సైతం నాడు వైకాపా పాలకుల కనుసన్నల్లో పనిచేసి నాణ్యత లోపించినా.. పట్టించుకోలేదు. ఏడాదిన్నర గడవకముందే రంగులు పాలిపోయాయి. డివైడర్లకు ప్లాస్టరింగ్ ఊడిపోయింది. రంగులు చెదిరిపోయి.. సిమెంటు కనిపిస్తోంది.

సుందరీకరణకు రూ.కోట్లు

కర్నూలు నగరంలో 52 వార్డులు, సుమారు 6.5 లక్షల జనాభా ఉంది. వైకాపా ప్రభుత్వంలో పాలకులు, అధికారులు ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించలేదు. సుందరీకరణ పేరుతో రూ.కోట్ల నిధులను వృథా చేశారు. ఇందులో భాగంగానే నగరంలో డివైడర్లు, కూడళ్లు, వంతెనలపై రక్షణ గోడలు.. ఇలా పలుచోట్ల రంగులు వేశారు. ఇందుకోసం రూ.2 కోట్లకుపైగా వెచ్చించినట్లు సమాచారం. మొదట్లో ఆకర్షణీయంగా ఉన్నా కొన్ని నెలలకే మాయమయ్యాయి. పనులు హస్తగతం చేసుకున్న గుత్తేదారులు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు.

పదే పదే అవే పనులు

నగరంలో పలుచోట్ల వేసిన వాటిపైనే పదే పదే రంగులు వేశారు. ఇందుకు భారీగా నిధులు ఖర్చు చేశారు. కొన్ని విభాగినులకు సిమెంటు ప్లాస్టరింగ్ ఊడిపోయినా.. సిమెంటు వేయకుండా రంగులు మాత్రం అద్దుతూ వచ్చారు. రంగులు వెలసిపోయిన తర్వాత పూర్తిగా తొలగించి తర్వాత తెల్లటి ప్రైమర్ రంగు వేయాలి. ఆ తర్వాత రెండుసార్లు కలర్ కోటింగ్ వేసి, ఆపైన బొమ్మలు, డిజైన్లు వేస్తారు. దీనికి గానూ నాణ్యమైన రంగులు వాడాల్సి ఉంది. కానీ నాసిరకం రంగులు వాడటంతో విభాగినుల వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రస్తుతం అధికారులు విభాగినులకు రంగులు వేయిస్తే పర్యవేక్షించాలని పురవాసులు కోరుతున్నారు.

★ ఇటీవల వినాయక ఘాట్ వద్ద నిమజ్జనం నేపథ్యంలో రంగులు వేశారు. వైట్ ప్రైమర్ వేయకుండానే రంగులు వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించారని విమర్శలు వినిపించాయి. ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మద్యం విక్రయాలకు 'లక్కీడిప్' నేడు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం విక్రయాల అనుమతుల కెటాయింపునకు సంబంధించి ఈ నెల 14న జరగనున్న లక్కీడిప్ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక జిల్లా పరిషత్‌లో ఏర్పాట్లను జేసీ డాక్టర్ నవ్య ఆదివారం పరిశీలించారు. సమావేశ మందిరంలో నిర్వహణ విధానం గురించి తెలుసుకున్నారు. మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులకు పలు సూచనలు ఆదేశాలిచ్చారు.



జడ్పీ హాలులో ఏర్పాట్లపై చర్చిస్తున్న జేసీ డాక్టర్ నవ్య

ప్రచార పత్రాల ఆవిష్కరణ

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: పాస్టర్స్ దినోత్సవం సందర్భంగా జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ రూపొందించిన జీసెస్ సోల్జర్స్ బ్రోచర్లను మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ క్రైస్తవ మత గురువులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతిని పెంపొందించే బాధ్యత పాస్టర్స్‌పై ఉందన్నారు. జీసెస్ సోల్జర్స్ వ్యవస్థాపకుడు రవికుమార్ మాట్లాడుతూ.. క్రైస్తవ మత బోధకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జి.రవికుమార్, ఆర్.ప్రసాదరావు, పుష్పరాజ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న టీజీ.వెంకటేష్, పాస్టర్లు

కొండారెడ్డి బురుజు వద్ద పొట్టేల్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఎన్ఐఎస్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో రూపొందించిన పొట్టేల్ చిత్ర బృందం కర్నూలులో ఆదివారం సందడి చేశారు. కథానాయకీ నాయకులు అనన్య నాగళ్ల, చందకృష్ణ నటించిన చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం ఎంతో కష్టపడుతున్నారో వివరించడమే ఈ చిత్రంలో ప్రధాన అంశమన్నారు. ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి చూడాలన్నారు.



పొట్టేల్‌తో చిత్ర కథానాయకుడు చంద్రకృష్ణ

సుభిక్ష సంకల్పం.. విజయ దశమి సంబరం

కర్నూలు బి.క్యాంపు, నగరం, కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేశామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ.భరత్, మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ అన్నారు. సంకల్‌బాగ్‌లో నిమజ్జన ఘాట్ వద్ద ఆదివారం దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నగర మేయర్ బీవై.రామయ్య, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డిసాయిరెడ్డి, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. తొలిసారి 'రాంలీలా' కార్యక్రమం నిర్వహించారు. రావణ చిత్రపటాన్ని దహనం చేశారు. కల్లూరు పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను తుంగభద్ర నదిలో నిమజ్జనానికి తరలించారు.



జ్యోతి వెలిగిస్తున్న చేస్తున్న అతిథులు



కళాకారులతో అతిథులు..



లలితాపీఠంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు..



స్వాగత నృత్యం



వాసవి నగర్‌లో దుర్గామాత ఊరేగింపులో వివిధ వేషధారణలతో భక్తులు



శరీన్‌నగర్‌లో చిన్నారుల నృత్యాలు




సూర్యనారాయణస్వామి ఆలయంలో బంగారు చీకర అలంకరణలో..



విగ్రహాన్ని మోసుకొని వెళ్తున్న మంత్రి



కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



పాతబస్తీ చెన్నకేశవస్వామి ఆలయంలో చిన్నారులకు జ్ఞాపికకల ప్రదానం

మురుగు పారే దారేది



బళ్లారి రోడ్డు వై జంక్షన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ వరకు ప్రధాన రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వ నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా రేడియో స్టేషన్ వెనుక ప్రధాన రహదారిపై నీరు నిలుస్తోంది. అసలే ఇరుకు దారి ఆపై నీరు నిలుస్తుండటంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. వీకర్ సెక్షన్ కాలనీ నుంచి వై-జంక్షన్ వరకు కాలువల నిర్మాణాలు చేపట్టాలని, మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

వీధి దీపం.. వెలిగితే పాపం

నగరంలోని వినాయక ఘాట్ నుంచి స్వామిరెడ్డి నగర్, కేసీ కాలువ వెంబడి.. హంద్రీ నదిలోని వంతెనపై వారం రోజులకు పైగా వీధి దీపాలు వెలగడం లేదు. హంద్రీ వంతెనపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంతో చీట్లో ఇబ్బందులు పడుతన్నారు. తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. వినాయక ఘాట్ నుంచి స్వామిరెడ్డి నగర్ వరకు పదికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం



అడుసులో అడుగేసేదెలా!



నగరంలోని స్థానిక బళ్లారి చౌరస్తా హనుమాన్ కాటా ఎదుటా బాబా బృందావన్ నగర్, ఎల్కూరు బంగ్లా, ఆటోనగర్, రైస్‌మిల్లులు.. తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వర్షాకాలంలో ఈ దారి మరింత అధ్వానంగా మారుతోంది. గోతుల మయంగా మారిన దారిని బాగు చేయాలని, సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు, వాహన చోదకులు, వివిధ వ్యాపార సంస్థల నాయకులు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించినా.. ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని వారు కోరారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆయన పరువు తీస్తున్నారు

కల్లూరు అర్బన్ పరిధిలోని 37వ డివిజన్ వీకర్‌సెక్షన్ కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య పేరుపై నగరపాలక సంస్థ వారు ఉద్యానవనం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా నిర్వహణ గాలికొదిలేశారు. పిచ్చిమొక్కలతో నిండి, వర్షం నీరు చేరి మడుగులా మారింది. అందులో అడుగు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. నగరపాలక సంస్థకు చెందిన రూ.అరకోటికి పైగా విలువ చేసే పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. మొక్కలు నాటి, నిర్వహణలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం



వైభవంగా బోనాల పండగ



గుట్టపాడు ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్థులు



దుర్గాదేవికి బోనాలు సమర్పిస్తున్న మహిళలతో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని హుసేనాపురంలో బోనాల పండగను భక్తులు వైభవంగా నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం ప్రత్యేక అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారిని గ్రామ సమీపంలోని వంకలో నిమజ్జనం చేశారు.

పేట్రేగిపోతున్న ఆటో దొంగలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో ఆటో దొంగలు వరుస నేరాలకు పాల్పడుతున్నారు. స్థానిక ఎస్.నాగప్పవీధికి చెందిన రాము పక్షవాతంతో బాధపడుతున్నారు. ఇంటికి వెళ్లేందుకు కోల్స్ కళాశాల వద్ద ఆటోఎక్కి డ్రైవర్ పక్కన కూర్చున్నారు. కొండారెడ్డి బురుజు వద్దకు చేరుకునే సరికి ఇతనికి ప్యాంటు జేబులోని పర్సు తస్కరించారు. రూ.3వేలు నగదు, రెండు ఏటీఎం కార్డులు, విలువైన ఇతర కార్డులు ఉండటంతో బాధితుడు కర్నూలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా దొంగలను గుర్తించేయత్నం చేస్తున్నారు.

రూసా రూకలు.. ఆగిన పనులు

☛ రూ.కోట్లు వెచ్చించి వదిలేశారు ☛ క్లస్టర్ వర్సిటీకి తప్పని కష్టాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు బి.క్యాంపులోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఆవరణలో క్లస్టర్ వర్సిటీ కోసం గతేడాది కిందట రూసా కింద నిదులు విడుదలయ్యాయి. వీటితో పరిపాలన భవనం, తరగతులు, విద్యార్థినుల వసతి గృహం, గ్రంథాలయం, ఇతర సముదాయాల నిర్మాణాలు చేపట్టారు. 20 శాతం పనులు కూడా పూర్తిచేయలేకపోయారు. ఆ అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. క్లస్టర్ వర్సిటీ నిర్వహణ సిల్వర్ జూబ్లీ కళాశాల వెనుక ఉన్న భవనంలో కొనసాగుతోంది. దీంతో వీటిని భవనాలను పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా మారాయి. ఈ భవనాలను తమకు కేటాయించాలని ఉర్దూ వర్సిటీ వీసీ ఫజుల్ రహమాన్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన విద్యా మండలి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలోని భవనాలను ఉర్దూ వర్సిటీకి కేటాయించాలని క్లస్టర్ వర్సిటీ వీసీకి నోటీసు ఇచ్చింది. దీనిపై స్పందన లేకపోవడంతో జిల్లా పర్యటనకు వచ్చిన మైనార్టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్‌కు ఉర్దూ వర్సిటీ వీసీ మరోసారి విన్నవించారు. ఆ భవనం తమకు ఇస్తే బాగు చేసుకోవడంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఆస్కారం ఉంటుందని కోరారు. ఈ భవనాల అభివృద్ధి కోసం 2022-23 ఆర్థిక ఏడాది కిందట రూ.8.97 కోట్లు మంజూరు చేశారు. 2023-24 ఏడాదికి రూ.52 కోట్లు కేటాయించారు. ఈ భవనాలు తమకు ఇవ్వాలని గత ఏడాది కిందట ఉర్దూ వర్సిటీ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి విన్నవించినట్లు సమాచారం.



నిరుపయోగంగా ప్రధాన భవనం

పరిసరాలు అపరిశుభ్రంగా..

ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఎవరూ లేకపోవడంతో తాగుబోతులు మద్యం తాగి పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. తాగుబోతులు, అధ్యాపకుల మధ్య గొడవలు జరిగిన సందర్భాలూ లేకపోలేదు. దీనిపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో అధ్యాపకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



తెరచుకోని క్యాంటీన్

దుకాణం దహనం



ముసుగు వేసుకుని దుకాణానికి నిప్పు పెడుతున్న వ్యక్తి

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే: కర్నూలు నగరశివారులోని కోడుమూరు రోడ్డులో టీస్టాల్ నిర్వాహకుడు శాంతిరాజు, ఫంక్షన్‌హాలు నిర్వాహకుడు వెంకటనాయుడు మధ్య అప్పు విషయంలో వివాదం నెలకొంది. ఇటీవల ఇరువర్గాలపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. 12వ తేదీ అర్ధరాత్రి సమయంలో శాంతిరాజు దుకాణానికి కొందరు పెట్రోలు పోసి నిప్పంటించారు. అక్కడ సీసీ కెమెరాల్లో ఆ దృశ్యాలు నమోదయ్యాయి. దుశ్చర్యలో ముగ్గురు పాల్గొన్నట్లు గుర్తించారు. శనివారం శాంతిరాజు ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు ఆనంద్‌నాయుడు మరికొందరిపైన మరో కేసు నమోదు చేశారు.